పడకేసిన పారిశుద్ధ్య వాహనాలు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని చెత్తను తొలగించే వాహనాలు మరమ్మతులకు గురవడంతో వీధుల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో చెత్తను తొలగించేందుకు మూడు ట్రాక్టర్లు, మూడు ఆటో ట్రాలీ వాహనాలు ఉండగా కొద్ది నెలల క్రితం రెండు ట్రాక్టర్లు, రెండు ఆటో ట్రాలీలు మరమ్మతులకు గురై మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణానికే పరిమితమయ్యాయి. దీంతో ఒక ట్రాక్టర్, ఒక ట్రాలీ ఆటోతో 15వార్డుల్లో చెత్తను సేకరిస్తున్నారు. వాహనాలు మరమ్మతులకు గురి కావడంతో ఇళ్లు, వీధుల్లో నాలుగు రోజులకోసారి చెత్తను తొలగిస్తుండడంతో చెత్త పేరుకుపోయి పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల కొరతతో కేవలం మెయిన్ రోడ్డులోనే ప్రతీరోజూ చెత్తను తొలగిస్తూ మిగతా ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పాలకుల ఆదేశాలతో తరచూ పట్టణ పరిధిలో జరిగే ప్రైవేట్ వేడుకలు, ఇతర కార్యక్రమాలకు చెత్త వాహనాలతోపాటు సిబ్బందిని తరలిస్తుండటంతో చెత్త సేకరణకు అంతరాయం కలుగుతోంది. వాహనాలకు ఇంజన్ ఆయిల్ మార్చకపోవడం, సకాలంలో మరమ్మతులు చేయించకపోవడంతో వాహనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాహన డ్రైవర్లతో పాటు సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంపై సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకవర్గం స్పందించి చెత్తను సేకరించే వాహనాలకు వెంటనే మరమ్మతులు చేయించాలని, కొత్త వాహనాలను కొనుగోలు చేసి వీధుల్లో క్రమం తప్పకుండా చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మున్సిపాలిటీలో మరమ్మతులకు గురైన వాహనాలు


మెయిన్ రోడ్డులో చెత్తను తీసుకెళ్తున్న ట్రాలీ

క్లుప్తంగా

ముల్కలపల్లిలో చోరీ

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లిలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామ శివారులో రైతు కాశబోయిన వెంకటేశ్వర్లుకు చెందిన మిరప కళ్లంలో సుమారు క్వింటా మిరపకాయను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మిరప కళ్లం సమీపంలోని మౌలాలికి చెందిన బిస్మిల్లా చికెన్ సెంటర్ ఐరన్ తీగలను తొలగించి 50కు పైగా కోళ్లను చోరీ చేశారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

రూ.35వేల ఆర్థికసాయం



కేసముద్రం: మండల కేంద్రంలోని స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలుకింద పడి బరిగెల పాండు అనే రైల్వే ఉద్యోగి శనివారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు ఆదివారం బాధిత కుటుంబానికి రైల్వే శాఖ నుంచి రూ.25వేలు, సీసీఎఫ్ నుంచి రూ.10వేలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రాజమౌళి, మజ్దూర్ యూనియన్ సెక్రటరీ యుగేంధర్, వైస్ చైర్మన్ భాస్కర్‌రావు, జేఈ సురేష్, సుధాకర్, వంశీ, రమేష్, రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల సెక్రటరీగా సరస్వతి



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల మహిళా సెక్రటరీగా లింగోజు సరస్వతిని నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సునావత్ రాధా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సేవాభావం కలిగి ఉండాలి



పెద్దవంగర: ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని దాత రావుల కరుణాకర్ అన్నారు. మండలంలోని గంట్లకుంట గ్రామంలో తన నాన్నమ్మ రావుల కమలమ్మ జ్ఞాపకార్థం గ్రామంలోని ప్రధాన వీధుల్లో రూ.35వేలు విలువ చేసే విశ్రాంత బెంచీలను సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముక్తార్ పాషా, రావుల వెంకటసోములు, ఎరుకల సమ్మయ్య, కన్నె సంతోష్, సతీష్, రావుల సతీష్, కొండ్రాతి శ్రీనాథ్, సంతోష్, ప్రసాద్, సోమయ్య పాల్గొన్నారు.

సన్మాన సభకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



మహబూబాబాద్ రూరల్: లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మార్చి 3వ తేదీన గిరిజన ఎమ్మెల్యేలు, మంత్రులకు సన్మాన సభ ఏర్పాటు చేశామని జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ అన్నారు. సన్మాన సభకు హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జాటోతు వెంకన్న నాయక్, టౌన్ గౌరవ అధ్యక్షుడు కేలోతు మల్సూర్ నాయక్, కార్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్, సాయికుమార్ నాయక్, కిషన్ నాయక్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని సేవాలాల్ సేన జాతీయ కోర్ కమిటీ సభ్యులు ధారవత్ మోతిలాల్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో జయంతి కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీన సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని అన్ని మండలాల్లో వేడుకలు, బోగ్‌బండారో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లకావత్ పద్మభాయి, భూక్య స్రవంతి, బానోత్ విజయ్‌నాయక్, ధరంసోత్ నారాయణ్‌సింగ్, బాదావత్ రాంబాబునాయక్, మాలోత్ సురేష్‌నాయక్, బాలాజీనాయక్, జర్పుల దేవేందర్, బానోత్ నరేందర్‌నాయక్, గుగులోత్ అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

గార్ల: తల్లితో గొడవ పడి ఓ యువతి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ ఆదివారం తెలిపాడు. గార్ల మండలం పెద్ద సరిహద్దుతండాకు చెందిన టి.శైలజ తల్లితో గొడవ పడి ఈనెల 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. గ్రామంలో, బంధువుల ఇళ్లు వెతికినా యువతి ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లి గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

561 మంది హాజరు

తొర్రూరు: సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం డివిజన్ కేంద్రంలోని సంక్షేమ బాలికల గురుకులంలో నిర్వహించిన పరీక్షకు 576 మందికి గాను 561 మంది విద్యార్థులు హాజరయ్యారు. 15మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని ఆర్‌సీఓ కె. ప్రత్యూష తనిఖీ చేశారు. ఆమె వెంట తహసీల్దార్ వినోద్‌కుమార్, ప్రిన్సిపాల్ జయశ్రీ, ఎస్సై జగదీష్ ఉన్నారు.

సీపీఐలో చేరిక

గార్ల: మండలంలోని మద్దివంచ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ లావుడ్యా భీముడునాయక్ ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి సమక్షంలో న్యూడెమోక్రసీ నుంచి సీపీఐలో చేరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితిసభ్యులు శ్రీను, వెంకన్న, రమేష్, జనార్దన్, వీరన్న పాల్గొన్నారు.

16న బంద్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న వీరన్న

మరిపెడ రూరల్: కేంద్రంలో దేశాన్ని పాలిస్తున్న నరేంద్ర మోదీ అవలంబిస్తున్న ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న సార్వత్రిక సమ్మెలో భాగంగా జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ మరిపెడ మండల కన్వీనర్ దుండి వీరన్న పిలుపునిచ్చారు. మరిపెడ మండలం తానంచర్లలో బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య అధ్యక్షతన సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన దుండి వీరన్న మాట్లాడుతూ.. కార్మిక చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. అదేవిధంగా రైతు వ్యతిరేక నల్లచట్టాల ద్వారా కార్పొరేటర్ సంస్థలకు ఊడిగం చేస్తుందన్నారు. నల్లచట్టాలను రద్దు చేస్తామని తాత్కాలికంగా వాయిదా వేసి మళ్లీ అదే చట్టాలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెంకన్న, కార్యదర్శి ఉపేంద్రచారి, భాస్కర్, సిద్దు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కేసముద్రం: కేసముద్రం విలేజిలోని జెడ్పీ హైస్కూల్‌లో 2005–06 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. ఈ మేరకు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం కొత్త జగన్ మోహన్‌రెడ్డి, అప్పటి గురువులు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, వాణి, సూర్యప్రకాశ్, లక్ష్మణ్, బండారు మధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అశోక్, శ్రీకాంత్, కుమార్, కుమార్, చక్రధర్, గణేష్, కాశీం, నరేష్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లో చేర్చాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్

నెహ్రూసెంటర్: ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీడీ నుంచి బీసీ 'ఏ'లోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చేలా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చాలన్నారు. రాష్ట్రంలో మత్స్యశాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు శ్రీనివాస్ తెలిపారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

తొర్రూరు: పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీని విజయ తీరాలకు చేర్చాలన్నారు. పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీలపై విస్తృత ప్రచారం అవసరమన్నారు. పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, నాయకులు నిరంజన్‌రెడ్డి, హామ్యానాయక్, సుంచు సంతోష్, నరేందర్‌రెడ్డి, బాపురెడ్డి, అచ్చిరెడ్డి, మేకల కుమార్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి


అభివాదం చేస్తున్న సంఘం నాయకులు

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులిదేవేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రూ.60లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌లకు రిజర్వేషన్ ఫలాలు అందక విద్యా, ఉద్యోగ, సాధికారతలో వెనుకబాటుకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏకు మారుస్తామని హామీ ఇచ్చిందని, హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. ముందుగా సంఘం విశిష్ట అతిథి నీలం దుర్గేష్ మెపా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సింగాని మహేష్, నాయకులు చిరుత వెంకటేశ్వర్లు, జెనిగల అనిల్, అశోక్, యాకయ్య, శ్రీనివాస్, మహేందర్, తోట రమేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

తండా సమస్యలు పరిష్కరిస్తా..


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కురవి: రేకుల తండా, రాంచంద్రాపురంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. ఆదివారం కురవి శివారు రేకుల తండా జీపీకి చెందిన బానోత్ ప్రతాప్‌నాయక్ అనే వ్యక్తి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి తండాకు వచ్చాడు. ఈమేరకు ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ తండాకు వెళ్లి ప్రతాప్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు తండాలో ఉన్న సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు లాలనాయక్, నాయకులు ఇంగ్యానాయక్, కృష్ణారావు, బాలనాయక్, వీరభద్రం పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌కు సలాం

- సమాజసేవలో తస్లీమా
- వృత్తి సబ్‌రిజిస్ట్రార్.. ప్రవృత్తి సమాజ సేవ
- సంపాదనలో సగం సేవా కార్యక్రమాలకే..

మహబూబాబాద్: మానుకోట సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ తన ఉద్యోగాన్ని సమర్థవంతంగా నిర్వర్తిస్తూనే సేవా రంగంలో కూడా రాణిస్తున్నారు. తన తండ్రి సర్వర్ స్ఫూర్తితో కొన్ని ఏళ్లుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో పలు జిల్లాల్లో చేసిన సేవలు మరువలేనివి.

ములుగు, భూపాలపల్లిలో జిల్లాలతో పాటు పలు జిల్లాల్లో సేవారంగంలో తన దైన ముద్ర వేసుకున్నారు. ములుగు జిల్లా, రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఫాతిమా సర్వర్ దంపతులకు నాల్గో సంతానం తస్లీమా మహ్మద్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేసింది. తన భర్త అబ్దుల్ గఫార్, వీరికి ఇద్దరు కుమారులు (సమన్, సుహన్) ఉన్నారు. తన తండ్రి పేరున సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ అండ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

సెలవు రోజు వ్యవసాయ కూలీగా..

సెలవు రోజుల్లో ములుగు జిల్లాలో వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుంది. వచ్చిన కూలీ డబ్బులను పేదలకు ఖర్చుచేస్తుంది. వ్యవసాయ కుటుంబం కావడం వలన రైతుల సమస్యలు తెలుసు కాబట్టి ఆపనులకు వెళ్లి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తుంది.

సేవా కార్యక్రమాలు..

అనాథలను ఆదుకోవాలనే తపనతో ముందుకు పోతుంది. ఆకలితో ఉన్న పిల్లలకు ఆకలి తీర్చుతుంది. చాలా కుటుంబాలలో ఇంటి పెద్ద చనిపోతే దహన సంస్కారాలు చేసి ఇంటికి పెద్ద దిక్కుగా నిలిచారు. కరోనా సమయంలో 1800 కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందించారు. జిల్లా కేంద్రంలోని రెండు చిల్డ్రన్స్ హోంలో పలు కార్యక్రమాలు చేశారు.

అవార్డులు..

13సార్లు ఉత్తమ అధికారిణిగా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. కాళేశ్వర ప్రాజెక్ట్ నిర్మాణం భూసేకరణలో భాగంగా వేల ఎకరాలకు భూ రిజిస్ట్రేషన్ చేసి తనదైన ముద్ర వేసుకున్నారు. మేడారం జాతర విజయవంతం కావడంలో విజిలెన్స్ అధికారిగా కీలకపాత్ర పోషించారు. ఏజెన్సీ ప్రాంతాలలో నోడల్ అధికారిగా పనిచేసి ఆ ప్రాంత ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించి ప్రజాప్రతినిధులు లేని లోటు తీర్చారు. మూలాలు మరువని బిడ్డగా తస్లీమా మంచి పేరు తెచ్చుకున్నారు.


వ్యవసాయ పనుల్లో తస్లీమా (ఫైల్)


కరోనా సమయంలో నిత్యావసర సరుకులు తీసుకెళ్తున్న తస్లీమా (ఫైల్)


జిల్లా కేంద్రంలోని దైవ కృప చిల్డ్రన్స్ హోంలో పిల్లలకు దస్తుల పంపిణీ (ఫైల్)

సంక్షిప్త సమాచారం

క్రీడలతో మానసికోల్లాసం



మహబూబాబాద్ అర్బన్: ప్రతి ఒక్కరికి క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మహబూబాబాద్ పోస్ట్ మాస్టర్ పెండ్రా రాంచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ 140 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో పోస్టల్ ఉద్యోగులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యోగులు సుధాకర్, అనిల్, సురేష్, సతీష్, యాకూబ్, సుధాకర్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

బయ్యారం: ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులు పుల్లయ్య తదితరులపై పోలీసులు పెట్టిన అక్రమకేసులు ఎత్తివేయాలని పార్టీ బయ్యారం మండల కార్యదర్శి బిల్లకంటి సూర్యం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. మూడు విప్లవ పార్టీల విలీన బహిరంగసభ సందర్భంగా గోడలపై రాతలు రాస్తున్న తమ నాయకులపై పోలీసులు అమానుషంగా వ్యవహరించి కేసులు నమోదు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా తమ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు.

మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం



కేసముద్రం: బీజేపీ అవలంభిస్తున్న మతతత్వ విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌లో జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తి కావస్తున్న రైతాంగ, కార్మిక, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో విఫలం అయిందన్నారు. కార్యక్రమంలో బానోత్ కైక, ఏసు, వీరమ్మ, యాకమ్మ, రంగమ్మ, భద్రమ్మ, విజయ, ద్వాలి, రామక్క పాల్గొన్నారు.


కేసు నమోదు

దంతాలపల్లి: మండలంలో భూతగాద కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపాడు. మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామంలో నిలుగొండ అఖిలతో తన మేనత్త అయిన ఆదిమూల పద్మ ఆస్తిలో తమకు హక్కు ఉందని గొడవకు దిగింది. రెండువర్గాల మధ్య తోపులాటలు, గొడవ జరగాయి. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుతో అఖిల, ఆమె భర్త విగనాష్, ఆదిమూల పద్మ, రాజేష్,రాములపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

ఎమ్మెల్యే సంతాపం

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం గ్రామానికి చెందిన కాలేరు నేతాజీ కుమార్తె ఆరాధ్య ఆదివారం మృతిచెందింది. విషయం తెల్సుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, నాయకులు సత్యపాల్‌రెడ్డి, బైరు అశోక్‌గౌడ్, కామినేని సురేష్, జగన్ పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



గార్ల: మండలంలోని మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి అర్చకుడు రామాయణం అచ్యుతాచార్యులుకు ఆదివారం తిరుపతిలో సీవీ రామన్ అకాడమి అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు అర్చక వైభవ రత్న అవార్డును అందజేశారు.

గ్రామాభివృద్ధికి కృషి చేశాం..



డోర్నకల్: ఐదేళ్ల పదవీకాలంలో గ్రామాభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేశామని రావిగూడెం మాజీ సర్పంచ్ మందా వరలక్ష్మి తెలిపారు. ఆదివారం వరలక్ష్మి, నాగేశ్వర్‌రావు దంపతులతో పాటు పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

మహబూబాబాద్ రూరల్: ఎమ్మెల్యే మురళీనాయక్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శివరాత్రి ఉప్పలయ్య, మక్కల నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొమ్మరాజుల వెంకన్న, కోశాధికారి వెంకటేశ్వర్లు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి సన్మానించారు.

జీపీ కార్మికుడి మృతి


దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న జీపీ కార్మికుడు తీగల పుల్లయ్య శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లయ్య రోజు మాదిరిగానే శనివారం విధులకు వెళ్లి.. కడుపులో నొప్పిగా ఉందని తిరిగి ఇంటికి వచ్చాడు. చికిత్స కోసం కుటుంబ సభ్యులు తొర్రూరుకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తీసుకు వెళ్లే క్రమంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశాడు.

'బాతుల వ్యాన్ వెళ్లిపోయింది'

సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్ రూరల్: 'పోలీసుల అదుపులో బాతుల వ్యాన్' అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి పోలీసు అధికారులు స్పందించారు. ఈమేరకు డీఎస్పీ సత్యనారాయణ ఆదేశాల మేరకు టౌన్ సీఐ రమేష్ కోర్టు ఉత్తర్వుల రాగానే శనివారం రాత్రి పది గంటల సమయంలో బాతుల వ్యానును పోలీసుస్టేషన్ ముందు నుంచి పంపించేశారు.

రాములోరి జెండాతో వానరం



కేసముద్రం: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా ఇటీవల మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఓ ట్రేడింగ్ కంపెనీ భవనంపై శ్రీరాముడి జెండాను భక్తులు కట్టారు. ఈ మేరకు ఆదివారం భవనంపైకి వచ్చిన వానరం, అక్కడున్న శ్రీరాముడి జెండా దగ్గరకు వచ్చింది, కొంత సమయం వరకు ఆ జెండాను అంటి పెట్టుకున్న వానరం సరదాగా గడిపింది. ఈ దృశ్యాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

భారీగా నల్లబెల్లం స్వాధీనం



డోర్నకల్: స్థానిక అమ్మపాలెం క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలో భాగంగా ఆదివారం డోర్నకల్ పోలీసులు భారీ నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై సంతోష్‌రావు ఆధ్వర్యంలో వాహన తనిఖీ నిర్వహిస్తూ లేలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల నల్లబెల్లం, రెండు క్వింటాళ్ల పటికను పట్టుకున్నట్లు తెలిపారు. బెల్లాన్ని తరలిస్తున్న గుంటూరు ఆటోనగర్‌కు చెందిన వేముల శివప్రసాద్, బలుసుపాటి పరమేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నామని కురవి మండలం మొగిలిచర్లకు చెందిన గుడిబోయిన వెంకన్న పారిపోయాడని తెలిపారు. బెల్లం, పటికతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.